
సాక్షి
ఆదిలాబాద్
శనివారం । 15 । జూన్ । 2024



'కడెం'.. రెడీ
రెండేళ్లుగా వానాకాలం భారీ వరదలతో దడపుట్టించి.. పరుగులు పెట్టించిన కడెం ప్రాజెక్టు ఈ ఏడాది వచ్చే వరదను నిల్వ చేసేందుకు సిద్ధమైంది. 8లో▸

ఫీజులు నియంత్రించాలని వినతి
ఎదులాపురం: ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు నియంత్రించాలని యునైటెడ్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ సోజర్, నగేశ్ డిమాండ్ చేశారు. ఈ విషయమై డీఈవో ప్రణీతను శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పాఠ్య పుస్తకాలు, యూనిఫాం విక్రయిస్తున్న విద్యా సంస్థల గుర్తింపు రద్దు చేయాలన్నారు.

వాతావరణం
గరిష్టం/కనిష్టం
36.0 /28.0
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

రైతులు అప్రమత్తంగా ఉండాలి



రైతులకు నగదు అందజేస్తున్న కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే శంకర్

ఆదిలాబాద్: రైతులు నగదు సంబంధిత వ్యవహారాల్లో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జిల్లా కేంద్రంలోని ఐపీపీబీ మేనేజర్ కారణంగా మోసపోయిన 75 మంది బాధిత రైతులకు రూ.1.15 కోట్ల నగదును జిల్లా తపాలా కార్యాలయంలో శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆన్‌లైన్ వ్యవస్థ ద్వారా నగదు చెల్లింపులు జరుగుతున్నప్పటికీ అన్నదాతలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులకు డబ్బులు తిరిగి అందించే విషయంలో కృషిచేసిన పోస్టల్ అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్, పోస్టల్ అధికారులు ఉన్నారు.

ఖాళీలన్నీ ప్రకటించాలి



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

కైలాస్‌నగర్: ఉపాధ్యాయుల పదోన్నతుల్లో భాగంగా జిల్లాలోని ఆయా పోస్టుల ఖాళీలన్నీ ప్రకటించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సునీల్ చవాన్, వి.గోపీకృష్ణ కోరారు. ఈ మేరకు శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో డీఈవో ప్రణీతను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్ యాజమాన్యాల్లోని పాఠశాలల్లో అప్‌గ్రేడ్ అయిన లాంగ్వేజ్ పండిట్, పీఈటీల ఖాళీలను వెబ్ కౌన్సెలింగ్‌లో చూపించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. వారి వెంట సంఘ బాధ్యులు తదితరులున్నారు.


నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు



విత్తనాల షాపు తనిఖీ చేస్తున్న పుల్లయ్య

తలమడుగు: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య అన్నారు. మండలంలోని సుంకిడి గ్రామంలో విత్తన దుకాణాలను శుక్రవారం తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు విక్రయించాలని, అలాగే తప్పనిసరిగా రశీదు అందించాలని దుకాణాదారులను ఆదేశించారు. ఆయన వెంట ఏవో మహేందర్, ఏఈవోలు లావణ్య, రమేశ్ ఉన్నారు.

మేకలమందపై చిరుత దాడి



చిరుత దాడిలో గాయపడ్డ మేక పిల్ల

తలమడుగు: మండలంలోని కొత్తూరు గ్రామ సమీపంలోని కొండపైన మేకల మందపై ఓ చిరుత దాడికి పాల్పడింది. ఈ ఘటనలో ఓ మేక పిల్లకు గాయమైంది. కాపరులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం గ్రామానికి చెందిన ముత్యాల ఆశన్న, స్వామి, బాపు ముగ్గురు వేర్వేరుగా మేకల మందలను మేత కోసం సమీపంలోని కొండపైకి తీసుకువెళ్లారు. మధ్యాహ్న సమయంలో ఓ చిరుత వచ్చి మందపై దాడిచేసి ఓ మేక పిల్లను ఎత్తుకెళ్లే యత్నం చేసింది. కాపరుల కేకలు, కుక్కల అరుపులతో చిరుత అక్కడి నుంచి పారిపోయింది. వెంటనే కాపర్లు మందలను కొండపై నుంచి కిందికి దింపారు. కాగా, కొండ సమీపంలో పంట పొలాలు ఉండడంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి చిరుతను పట్టుకోవాలని కోరుతున్నారు.

అసైన్డ్.. హాంఫట్!

ఈ చిత్రంలో కనిపిస్తున్నది మావల మండలంలోని భట్టి సావర్గం 72/3 సర్వే నంబర్‌లోని అసైన్డ్ భూమి. అసైని నుంచి దొడ్డిదారిన కొనుగోలు చేసిన కొంతమంది దాని లేఅవుట్ రూపకల్పనలోనూ మాయాజాలానికి పాల్పడ్డారు. పదెకరాల విస్తీర్ణంలో వెంచర్ రూపొందించి, ఎల్ఐసీ ఏజెంట్స్ హౌసింగ్ కాలనీ పేరిట ప్లాట్లుగా తయారు చేశారు. వందకు పైగా ప్లాట్లు ఇందులో ఏర్పాటు చేయగా, ఇప్పటికే సగానికి పైగా రిజిస్ట్రేషన్లు జరిగాయి. అయితే ఈ ఏజెంట్స్ 2009లో ఈ భూమిని మాదస్తు నర్సింహులు నుంచి కొనుగోలు చేసినట్టు రెవెన్యూ రికార్డుల్లో ఉంది. ఈ ప్లాట్లు చేసేందుకు సర్పంచ్ నీరటి గంగన్న అనుమతి ఇచ్చినట్లు లేఅవుట్ కాపీలో స్పష్టం చేశారు. అయితే గంగన్న 2001 వరకే సర్పంచ్ పదవిలో ఉన్నారు. ఆయన 2009 తర్వాత ఈ ప్లాట్లు చేసుకునేందుకు అనుమతి ఎలా ఇచ్చారనేది ప్రశ్నార్థకం. కాగా, గంగన్న 2010లో మృతి చెందారు. ఇలా అసైన్డ్ భూమిని కొట్టేసేందుకు రకరకాల అక్రమాలకు పాల్పడినట్లు తెలుస్తోంది.



బట్టిసావర్గాం 72/3 సర్వే నంబర్‌లోని లేఅవుట్

- ప్లాట్లుగా చేసి జోరుగా విక్రయాలు
- బోగస్ అనుమతులతో లేఅవుట్ల రూపకల్పన
- జిల్లా కేంద్రం చుట్టుపక్కల విలువైన భూములు అన్యాక్రాంతం
- 'రెవెన్యూ'లో చక్రం తిప్పుతున్న ఓ అధికారి?

సాక్షి,ఆదిలాబాద్: జిల్లాలో అసైన్డ్ భూములు కైంకర్యం ఎలా అవుతున్నాయో చెప్పడానికి ఒక నిదర్శనమిది. అసైన్డ్ భూములను కొల్లగొట్టాలని అనుకునేవారు ఇలాంటి కుయుక్తులకు పాల్పడుతున్నారు. మాదస్తు నర్సింహులు అనే అసైనికి ప్రభుత్వం ఈ భూమిని ఇవ్వడం జరిగింది. ఈ అసైన్డ్ భూమికి గతంలో రెవెన్యూ శాఖ నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) ఇచ్చి ఆ తర్వాత రద్దు చేశారు. ఈ లెక్కన ఆ భూమి ఎవరి పేరిట ప్రభుత్వం అసైన్ చేసిందో ఆయనపైనే ఉండాలి. ఎన్‌వోసీ లేకుండా ఆ భూమిపై ఇతర కార్యకలాపాలు చేయడానికి వీలు లేదు. అయితే దొడ్డిదారిన ఆ భూమిని కొనుగోలు చేసిన ఏజెంట్స్ అంతే అక్రమ పద్ధతిలో లేఅవుట్ రూపకల్పనకు పాల్పడ్డారు. ఏకంగా చనిపోయిన సర్పంచ్ ఈ ప్లాట్లు చేసుకునేందుకు అనుమతినిచ్చినట్లు లేఅవుట్ రూపొందించడం గమనార్హం.



72/3 సర్వేనంబర్‌కు సంబంధించి లేఅవుట్ కాపీ

జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలనే అభిప్రాయం..
జిల్లా కేంద్రానికి చుట్టుపక్కల ఇలాంటి విలువైన అసైన్డ్ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలనే అభిప్రాయం సామాన్య జనం నుంచి వ్యక్తమవుతుంది. జిల్లా అభివృద్ధిలో ఏదైన పరిశ్రమ, కళాశాల, ఇతరత్రా ఏదైన రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసినప్పుడు ప్రభుత్వ భూమి అవసరం పడుతుంది. ప్రస్తుతం రూపొందిస్తున్న సమీకృత కలెక్టరేట్ భవనం వెనకాలే బట్టిసావర్గాంలో పదెకరాల అసైన్డ్ భూమిలో అక్రమార్కులు ప్లాట్లను చేశారు. అంతకుముందు కలెక్టరేట్ కోసం భూమి అన్వేషణలో పూర్తిస్థాయిలో ఇక్కడ స్థలం లభ్యం కాలేదు. సమీకృత కలెక్టరేట్‌కు ఇన్, అవుట్ గేట్లు విడివిడిగా కాకుండా ఒకటే నిర్మిస్తుండటం గమనార్హం. స్థలభావం కారణంగా ఇలాంటి పరిస్థితి తలెత్తింది. అంతే కాకుండా గంతలో ఉద్యానవన కళాశాల మంజూరైనప్పుడు పెద్ద ఎత్తున ప్రభుత్వ భూమి జిల్లా కేంద్రంలో దొరకక పోవడంతో దానికి జైనథ్ మండలంలోని మేడిగూడ వద్ద స్థలం కేటాయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఈ భూములపై దృష్టి సారించి వాటిని స్వాధీనం చేసుకునే విషయంలో చర్యలు తీసుకోవాలన్న అభిప్రాయం పలువురి నుంచి వ్యక్తమవుతుంది. ఈ విషయమై మావల తహసీల్దార్ వేణుగోపాల్‌ను 'సాక్షి' ఫోన్లో సంప్రదించేందుకు యత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

జిల్లా కేంద్రంలోనే పరాకాష్ట..
జిల్లా కేంద్రం శివారులోని పంచాయతీ, ప్రస్తుతం పట్టణంలో కలిసిన వార్డుల్లో ఇలాంటి అసైన్డ్ భూములు వందల ఎకరాలు ఉన్నాయి. ఇలాంటి భూములను బోగస్ ఎన్‌వోసీల ద్వారా అక్రమార్కులు కొల్లగొట్టేశారు. ప్రస్తుతం బట్టిసావర్గాంలోని 72/3 సర్వే నంబర్‌తో పాటు 134/1 సర్వే నంబర్‌లోనూ ఇలాగే అసైన్డ్ భూములను ప్లాట్లుగా చేసి విక్రయిస్తున్నారు. మావలలోని 170, 181 సర్వే నంబర్లలోనూ ఇలాంటి పరిస్థితే ఉంది. ప్రధానంగా రెవెన్యూ శాఖలో ఈ సర్వే నంబర్లపై పట్టు ఉన్నటువంటి ఓ కీలక అధికారి వాటి పరాధీనంలో కీలక చక్రం తిప్పుతున్నారనే ప్రచారం ఉంది.

బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

- కలెక్టర్ రాజర్షి షా



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: బడీడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బడిబాట కార్యక్రమ నిర్వహణపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలాల వారీగా లక్ష్యాలను సాధించేందుకు ఎంఈవోలు బాధ్యత తీసుకొని పిల్లలందరూ పాఠశాలల్లో చేరేలా కృషి చేయాలన్నారు. గతంతో పోల్చితే ఈ ఏడాది అడ్మిషన్లు పెరగాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లు నిండిన పిల్లలను ప్రైమరీ స్కూల్‌లో చేర్పించాలని సూచించారు. అంతకు ముందు మండలాల వారీగా ఇప్పటి వరకు నమోదైన పిల్లల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీఈవో ప్రణీత, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, డీడబ్ల్యూవో సబిత, డీఆర్డీవో సాయన్న, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

20న నులి పురుగు నివారణ దినోత్సవం
ఈ నెల 20న జాతీయ నులి పురుగు నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. కార్యక్రమ నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1–19 ఏళ్లలోపు వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయించి ఆరోగ్యకర నిర్మాణానికి సహకరించాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి విధిగా మాత్రలను అందించాలని తెలిపారు. జిల్లాలో నిర్దేశిత వయసు లోపు వారు 2,21,141 మంది ఉన్నారన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, ఎస్సీ, ఎస్టీ ,బీసీ, మైనారిటీ వసతి గృహాలు, గురుకులాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలందరికీ ఈ మాత్రలు వేయాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీఈవో ప్రణీత, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీలకు రంగం సిద్ధం !

- ఐఏఎస్, ఐపీఎస్ నుంచి కింది స్థాయి వరకు
- ఉమ్మడి జిల్లా అధికారులకు స్థాన చలనం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అధికారుల బదిలీలకు రంగం సిద్ధమైంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఐఏఎస్, ఐపీఎస్ స్థాయి నుంచి కింది స్థాయి అధికారుల వరకు బదిలీలు జరగనున్నాయి. ఈ మేరకు ఉన్నతస్థాయిలో బదిలీల జాబితా రూపొందుతోంది. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల సందర్భంగా అన్నీ శాఖల్లోనూ అధికారులకు స్థాన చలనం కలిగింది. సొంత జిల్లా, మూడేళ్ల సర్వీసు తదితర నిబంధనలతో ఇతర జిల్లాల నుంచి అనేక మంది విధుల్లో చేరారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పని చేస్తున్నారు. పోలింగ్, ఫలితాలు వెల్లడి, కోడ్ ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనపై దృష్టి సారించింది. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా బదిలీల్లో భాగంగా కలెక్టర్ల నుంచి ఐపీఎస్‌ల వరకు స్థాన చలనం కలిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లా పరిధిలోని నాలుగు జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సీపీ, డీసీపీ, ఎస్పీ, ఏసీపీలు, డీఎస్పీలు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, సీఐలు, ఎస్సైలతోపాటు ఇతర శాఖల్లోని సిబ్బంది బదిలీలు జరిగే జాబితాలో ఉన్నారు. ఈక్రమంలో జిల్లా, డివిజనల్, మండల స్థాయి అధికారులకు తమ సొంత జిల్లాలకు లేదా కోరుకున్న చోట పోస్టింగ్‌ల కోసం ఇప్పటికే వినతులు, పైరవీలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో నేడో రేపో భారీ గా అధికారుల బదిలీలకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న వారిలోకరీంనగర్, వరంగల్, ఖమ్మం , నిజామాబాద్ ఉమ్మడి జిల్లా నుంచి అధికంగా ఉన్నారు. అలాగే ఉమ్మడి జిల్లాకు చెందిన ఉద్యోగులు, గతంలో పని చేసిన వారంతా తిరిగి ఇక్కడి రావాలని ప్ర యత్నాలు చేసుకుంటున్నారు. ఇప్పటికే ఆయా ఉ ద్యోగ సంఘాల నేతలు, తెలిసిన ప్రజాప్రతినిధులతో సిఫారసులు చేయించుకుంటున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాకు మళ్లీ పాత అధికారులే ఎక్కువగా వచ్చే అవకాశాలు కనిపిస్తున్నట్లు తెలుస్తోంది.

'ధరణి' దరఖాస్తులు పరిష్కరించాలి

- సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ శ్యామలా దేవి తదితరులు

కైలాస్‌నగర్: ధరణి మాడ్యూల్స్‌లో ఉన్న పెండింగ్ దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ ఆదేశించారు. హైదరాబాద్‌లోని తన కార్యాలయం నుంచి ఆయా జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధరణి, ప్రజావాణికి సంబంధించి పెండింగ్ దరఖాస్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాటిని త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లాలోని తహసీల్దార్లతో కలెక్టర్ వీసీ ద్వారా సమీక్షించారు. ధరణి మాడ్యూల్స్‌లో పెండింగ్ దరఖాస్తులను మూడు రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. తహసీల్దార్, ఆర్డీవో, అదనపు కలెక్టర్ అన్ని స్థాయిలో ప్రాధాన్యత పరంగా దరఖాస్తులను ప్రతిరోజు పర్యవేక్షిస్తూ పెండింగ్ లేకుండా చూడాలన్నారు. అలాగే విత్తనాల దుకాణాలు, గోదాంలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలన్నారు. వర్షాకాలం సమీపిస్తున్నందున లోతట్టు ప్రాంతాలపై దృష్టి సారించాలన్నారు. ముంపు ప్రాంతాలను గుర్తించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో జివాకర్ రెడ్డి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ నలంద ప్రియా , తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

వెబ్ ఆప్షన్లకు తప్పని నిరీక్షణ

- రాత్రి వరకు వేచిచూసినా ఉపాధ్యాయులకు నిరాశే
- విద్యాశాఖ తీరుపై సర్వత్రా విమర్శలు

కైలాస్‌నగర్: ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతుల ప్రక్రియ నిర్వహణలో జిల్లా విద్యాశాఖ తీరు విమర్శలకు తావిస్తోంది. సీనియారిటీ జాబితాను శుక్రవారం ప్రకటించాల్సి ఉండగా, రాత్రి 9 గంటలు దాటినా ప్రకటించకపోవడం అధికారుల పనితీరుకు నిదర్శనంగా నిలుస్తోంది. ఉపాధ్యాయ ఖాళీలను ప్రకటించడంలోనూ ఆ శాఖ అధికారులు తాత్సార వైఖరి అవలంభించడం విమర్శలకు తావిస్తోంది. సీనియారిటీ జాబితా, ఖాళీల వివరాలను ప్రకటిస్తేనే పదోన్నతులకు దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు వెబ్ ఆప్షన్లు ఇచ్చే అవకాశం ఉంటుంది. కానీ ఇప్పటివరకు అలాంటి వివరాలేమి ప్రకటించకపోవడంతో అర్హులైన ఉపాధ్యాయుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఇప్పటికే ఆ వివరాలు ప్రకటించి వెబ్ ఆప్షన్లు బుధ, గురువారాల్లోనే అందించగా, జిల్లాలో ఇప్పటివరకు ఆ అవకాశం కల్పించకపోవడం పరిస్థితికి అద్దం పడుతోంది. అధికారుల వైఫల్యంపై ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి. పదోన్నతుల కోసం ఏళ్లుగా నిరీక్షిస్తున్న ఎస్జీటీలు, పీఈటీలు, భాషా పండిట్‌లు వెబ్ ఆప్షన్లు ఇచ్చేందుకు సన్నద్ధం అవ్వగా, వెబ్‌సైట్‌లో వివరాలు కనిపించకపోవడంతో వారు ఆందోళనకు గురవుతున్నారు. కాగా శనివారం ఈ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉందని విద్యా శాఖ అధికారులు చెబుతుండటం గమనార్హం.

అంగన్‌వాడీ చిన్నారులకు యూనిఫాం

- ఎస్‌హెచ్‌జీలకు కుట్టు బాధ్యతలు
- రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ



అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులు (ఫైల్)



యూనిఫాం నమూనాలు

కైలాస్‌నగర్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్యనభ్యసించే చిన్నారులకు కూడా యూనిఫాం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అయితే తొలుత ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు మాత్రమే ప్రయోగాత్మకంగా అందించనున్నారు. వీటిని కుట్టించే బాధ్యతను జిల్లాలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు అప్పగించనున్నారు. ఇందుకు సంబంధించి కుట్టుకూలి సైతం నిర్ణయిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

స్వయం సహాయక సంఘాలకు కుట్టించే బాధ్యతలు
స్వయం సహాయక సంఘాల సభ్యులను కోటీశ్వరులను చేస్తామని ప్రకటించిన రేవంత్‌రెడ్డి సర్కారు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వారికి ఆ దిశగానే ప్రాధాన్యతనిస్తుంది. ఇటీవల ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అవసరమైన యూనిఫాం కుట్టించే బాధ్యతను వారికే అప్పగించింది. జిల్లాలోని 1,804 మంది ఎస్‌హెచ్‌జీ సభ్యులను ఇందుకు ఎంపిక చేసి వారితో యూనిఫాంలు కుట్టించారు. ఒక్కో జతకు వారికి రూ.75 చొప్పున చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తాజాగా అంగన్‌వాడీల చిన్నారుల యూనిఫాం కుట్టించే బాధ్యతలు సైతం వారికే అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బాలికలకు ఫ్రాక్, బాలురకు నెక్కర్, చొక్కా అందించనున్నారు. రెడ్, బ్లూ, యాష్, వైట్ రంగులతో ఈ యూనిఫాం ఉండనుంది. ఒక్కో ఫ్రాక్‌కు రూ.60, బాలుర డ్రెస్‌కు రూ.80 చొప్పున కుట్టుకూలి చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలోని చిన్నారులకు అవసరమైన వస్త్రాన్ని ఆప్కో ద్వారా ఐసీడీఎస్‌కు అందించనున్నారు. సంబంధిత అధికారులు ఆ వస్త్రాన్ని ఎస్‌హెచ్‌జీలకు అందజేస్తే వారు డ్రెస్‌లను కుట్టించి ఇవ్వనున్నారు. త్వరలోనే కేంద్రాల వారీగా విద్యార్థుల కొలతలు తీసుకునేలా డీఆర్డీఏ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..
జిల్లాలోని ఐసీడీఎస్‌లో ఐదు అంగన్‌వాడీ ప్రాజెక్టులున్నాయి. వీటి పరిధిలో 1,256 కేంద్రాలున్నాయి. ఇందులో మూడు నుంచి ఐదున్నరేళ్లలోపు చిన్నారులు సుమారు 25 వేల మంది వరకు ఉన్నారు. వీరికి పౌష్టికాహారంతో పాటు ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నారు. ఈ చిన్నారులకు సైతం ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల మాదిరిగా యూనిఫాం అందించాలని రేవంత్ సర్కారు నిర్ణయించింది. అయితే చిన్నారులందరికీ కాకుండా ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణాల్లో గల అంగన్‌వాడీ కేంద్రాల్లోని వారికి మాత్రమే తొలుత అందించాలని నిర్ణయించారు. జిల్లాలో 220 కేంద్రాలు ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో కొనసాగుతున్నాయి. వీటిలో 4,020 మంది బాలికలు, 4,009 మంది బాలురు ఉన్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో 8,029 మంది చిన్నారులకు తొలుత యూనిఫాం అందనుంది.

ఆశ్రమ పాఠశాలలవి కూడా వారికే
అంగన్‌వాడీ చిన్నారుల యూనిఫాంతో పాటు గిరిజన సంక్షేమశాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాల్లో చదివే గిరిజన విద్యార్థుల యూనిఫాం కుట్టించే బాధ్యతలు సైతం ఎస్‌హెచ్‌జీలకే అప్పగించారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఆశ్రమ పాఠశాలలు, గిరిజన సంక్షేమ వసతిగృహాలు కలిపి మొత్తం 53 ఉండగా ఇందులో 15వేల మంది బాల, బాలికలు చదువుకుంటున్నారు. ఒక్కో విద్యార్థికి రెండు జతల చొప్పున యూనిఫాంలు ఇవ్వనున్నారు. వీరికి అవసరమైన 30వేల యూనిఫాంలను ఎస్‌హెచ్‌జీ సభ్యులే కుట్టనున్నారు. అందుకు సంబంధించిన ప్రక్రియ శనివారం నుంచి ప్రారంభం కానుంది.

ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం



అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు అవసరమైన యూనిఫాం అందించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రం, స్కూల్ వారీగా విద్యార్థుల వివరాలు అందించాలని ఐసీడీఎస్ అధికారులను కోరాం. వారు వివరాల మేరకు కలెక్టర్‌కు ఫైల్ పంపి ప్ర క్రియను ప్రారంభిస్తాం. గిరిజన సంక్షేమ వసతిగృహాల్లోని విద్యార్థుల యూనిఫాంలు సైతం కుట్టించాలని ఆదేశించగా కలెక్టర్ అనుమతి తీసుకుని వివరాలు ఏపీఎంలకు అందజేశాం. పాఠశాలల వారీగా ఇప్పటికే ఎంపిక చేసిన ఎస్‌హెచ్‌జీ సభ్యులు విద్యార్థుల కొలతలు సేకరించాక యూనిఫాం స్టిచింగ్ ప్రారంభిస్తాం.

– సాయన్న, డీఆర్డీవో

పలకరించిన తొలకరి.. రైతన్న బిజీ





ఇంద్రవెల్లి: తొలకరి పలకరించడంతో మండలకేంద్రంతో పాటు పలు గ్రామాల్లో రైతులు శుక్రవారం సాగు పనుల్లో బిజీగా మారారు. దుక్కులు దున్నడం, విత్తనాలు విత్తడం, ఎరువులు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలువాలి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

కైలాస్‌నగర్: యువత రక్తదానానికి స్వచ్ఛందంగా ముందుకొచ్చి ప్రాణదాతలుగా నిలువాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకుని రిమ్స్ రక్తనిధి కేంద్రంలో వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌తో కలిసి ఆయన శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదాతలను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఎంతోమంది రక్తహీనత, తలసేమియాతో బాధపడుతున్నారన్నారు. అలాగే ప్రమాదాలకు గురైన వారిలో చాలామంది సకాలంలో రక్తం అందక ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. గర్భిణులు సైతం ప్రసవ సమయంలో ఇబ్బందులు పడుతున్నారన్నారు. 18 నుంచి 56 ఏళ్ల లోపు ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకొచ్చి సామాజిక బాధ్యతను చాటాలన్నారు. కార్యక్రమంలో యువజన సంఘాల జిల్లా అధ్యక్షులు బాలశంకర్ కృష్ణ, అర్బాత్ ఖాన్, ఖాజా సిరాజొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఫొటోగ్రఫీ వర్క్‌షాప్‌లో ఖానాపూర్ వాసికి మెడల్



రాజ్‌కుమార్‌కు కాంస్య పతకం అందజేస్తున్న శేఖర్

ఖానాపూర్: సిగ్మా ఆర్ట్స్ అకాడమీ ఆఫ్ ఫొటోగ్రఫీ ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీ నుంచి 11వ తేదీ వరకు కులుమనాలిలో నిర్వహించిన 90వ వర్క్‌షాప్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు. ఇందులో ఖానాపూర్‌కు చెందిన బి.రాజ్‌కుమార్ ఫొటోగ్రఫీలో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఓపెన్ కేటగిరీలో కాంస్య పతకం సాధించారు. సిగ్మా అకాడమీ చైర్మన్ ఎంసీ.శేఖర్ మెడల్ ప్రదానం చేశారు.

సౌత్‌జోన్ ఉషు పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన క్రీడాకారులు

భైంసాటౌన్: ఖేలో ఇండియా సౌత్‌జోన్ ఉషు పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటారు. కర్ణాటకలో ఈ నెల 10 నుంచి 13 వరకు జరిగిన ఖేలో ఇండియా శిక్షణ కేంద్రం నుంచి 9 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈబృందంలో నలుగురు కాంస్య పతకాలు సాధించినట్లు ఖేలో ఇండియా శిక్షణ కేంద్రం కోచ్ శ్రీరాముల సాయికృష్ణ తెలిపారు. జియాన్షు – సీనియర్ విభాగంలో, రాజశ్రీ 42 కేజీల జూనియర్ విభాగంలో, ప్రణతి 45 కేజీల సీనియర్ విభాగంలో, ప్రతీక్ష 52 కేజీల సీనియర్ విభాగంలో కాంస్య పతకాలు సాధించారు. రూ.2 వేల చొప్పున నగదుతోపాటు కాంస్య పతకాలు ప్రదానం చేశారు. పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా క్రీడల అధికారి నఫేఖాన్, జిల్లా మార్షల్ ఆర్ట్స్ శిక్షకుడు తేజేందర్‌సింగ్ భాటియా, శ్రీకాంత్, శివరాజ్‌గౌడ్, నితిన్‌గౌడ్, లింగం అభినందించారు.

కుంటాల ఎంపీపీపై కేసు

కుంటాల: కుంటాల వైద్యురాలని దూషించినందుకు ఎంపీపీ అప్పు గజ్జారాంపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై రాందాస్ తెలిపారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా కుంటాల రైతు వేదికలో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో వైద్యురాలు శృతిరెడ్డిని ఎంపీపీ దూషించారు. దీంతో ఇద్దరి మధ్య సమావేశంలోనే వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో శుక్రవారం వైద్యురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు ఈమేరకు 186, 506, 509 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

'కంది' ఎమ్మెల్యే అయ్యేవరకు చెప్పులు ధరించను..

- కాంగ్రెస్ నాయకుడు పిడుగు స్వామి శపథం

జైనథ్: కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి ఎమ్మెల్యేగా గెలిచి, అసెంబ్లీలో అడుగు పెట్టే వరకు తాను కాళ్లకు చెప్పులు ధరించబోనని ఆ పార్టీ ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు పిడుగు స్వామి యాదవ్ శపథం పూనారు. మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించి, శపథం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఆదిలాబాద్ నుంచి కంది భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలవడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయన అసెంబ్లీలో అడుగు పెట్టే వరకు తాను చెప్పులు ధరించనని, ఆయన గెలుపే లక్ష్యంగా అహర్నిశలు కృషి చేస్తానని అన్నారు.

'కడెం'.. రెడీ..



కడెం ప్రాజెక్ట్

- తుది దశకు చేరిన ప్రాజెక్టు మరమ్మతు పనులు
- పనులు పర్యవేక్షిస్తున్న చీఫ్ ఇంజినీర్
- ఆయకట్టు రైతులకు ఎమ్మెల్యే బొజ్జు భరోసా

కడెం: రెండేళ్లుగా వానాకాలం భారీ వరదలతో దడ పుట్టించి.. పరుగులు పెట్టించిన కడెం ప్రాజెక్ట్ ఈ ఏడాది వచ్చే నీటిని నిల్వ చేసేందుకు సిద్ధమైంది. 2022లో వరదలు వచ్చి ప్రాజెక్ట్ డేంజర్ జోన్‌లోకి వెళ్లింది. అప్పటి ప్రభుత్వం మరమ్మతులు చేయించలేదు. 2023 వానాకాలంలో మళ్లీ భారీ వరదలు వచ్చి ప్రాజెక్ట్‌ను అతలాకుతలం చేశాయి. వరదలకు దెబ్బతిన్న ప్రాజెక్ట్ మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించడంతో నాలుగు నెలలుగా మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. వరద గేట్ల మరమ్మతు పనులు తుది దశకు చేరినట్లు ఇరిగేషన్ అధికారులు పేర్కొన్నారు. సీఈ శ్రీనివాస్ వారంలో రెండు రోజులుగా కడెంలోనే ఉంటూ మరమ్మతు పనులను పర్యవేక్షిస్తున్నారు.

తుది దశకు పనులు

కడెం ప్రాజెక్ట్ వరద గేట్ల మరమ్మతు పనులకు రాష్ట్ర ప్రభుత్వం జనవరి 29న రూ.5.46 కోట్లు మంజూరు చేసింది. నాలుగు నెలల నుంచి చేపట్టిన మరమ్మతు పనులు 90 శాతం పూర్తయినట్లు అధికారులు తెలిపారు. వరద గేట్లకు కొత్త రూలర్స్, రబ్బర్ సీల్స్, గేర్ బాక్స్‌లు, బ్రేక్ లైనర్స్ అమర్చారు. కొన్ని వరద గేట్లకు కొత్త మోటార్లు బిగించారు. సివిల్ వర్క్‌లో భాగంగా స్పిల్‌వే పనులు, ఆఫ్రాన్, వాల్స్ పనులు పూర్తయ్యాయి. కొన్ని మైనర్ పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి.

కౌంటర్ వెయిట్ బిగించాలి

వరద గేట్ల పనులు చివరి దశకు చేరినా ప్రాజెక్టు 2వ, నంబర్ వరద గేటుకు కౌంటర్ వెయిట్ బిగించాల్సి ఉంది. కౌంటర్ వెయిట్‌ను ప్రాజెక్టు వద్ద తయారు చేసి సిద్ధంగా ఉంచారు. దానిని బిగించేందుకు నట్ బోల్ట్‌లు అందుబాటులో లేకపోవడంతో జాప్యం జరుగుతోంది. బెంగుళూరుకు చెందిన హిల్టీ అనే సంస్థ నట్, బోల్ట్స్ తయారు చేస్తోందని, నట్ బోల్ట్స్ రాగానే కౌంటర్ వెయిట్‌ను బిగిస్తామని అధికారులు తెలిపారు.

కొనసాగుతున్న ఎలక్ట్రికల్ పనులు

ప్రాజెక్టు లక్ట్రికల్ వ్యవస్థ పునరుద్ధరణ నిమిత్తం మార్చి 15న, రాష్ట్ర ప్రభుత్వం రూ.3.81 కోట్లు మంజూరు చేసింది. ఇన్నేళ్లుగా కడెం మండల కేంద్రం ఫీడర్ నుంచి ప్రాజెక్టుకు విద్యుత్ సరాఫరా అయ్యేది. ఈ ఫీడర్‌లో తరచూ సమస్యలు తలెత్తేవి. దీంతో ప్రాజెక్టుకు మిషన్ భగీరథకు సంబంధించి ఫీడర్ ద్వార సరాఫరా ఇచ్చేందుకు 500 కేవీ నూతన ట్రాన్స్ ఫార్మర్‌తో ప్రాజెక్టు గేజ్ రూం వరకు ప్రత్యేక లైన్ వేశారు. కొత్త జనరేటర్ రావడంతో ప్రస్తుతం మూడు జనరేటర్లు అందుబాటులో ఉన్నాయి. ఇంకా కొన్ని పనులు కొనసాగుతున్నాయి.



మరమ్మతు పనులు చేస్తున్న సిబ్బంది



పనులను పర్యవేక్షిస్తున్న సీఈ శ్రీనివాస్

పనులు పూర్తయ్యాయి

కడెం ప్రాజెక్టు వరద గేట్ల రోలర్స్, రబ్బర్ సీల్స్, గేర్ బాక్స్‌లు, బ్రేక్ లైనర్స్ తదితర మరమ్మతు పనులు పూర్తయ్యాయి. 2వ నంబర్ గేటుకు కౌంటర్ వెయిట్ బిగించాల్సి ఉంది. నూతన విద్యుత్ లైన్, జనరేటర్, ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేశాం. కొన్ని ఎలక్ట్రికల్ పనులు కొనసాగుతున్నాయి.

– విఠల్, ఈఈ, కడెం ప్రాజెక్టు

ఆయకట్టు రైతులకు అండగా..

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి కడెం ప్రాజెక్టు మరమ్మతులకు రూ.9.21 కోట్లు మంజూరు చేసింది. సకాలంలో ప్రాజెక్టు మరమ్మతు పనులు పూర్తవుతున్నాయి. ప్రాజెక్టు చివరి ఆయకట్టు వరకు సాగు నీటిని విడుదల చేస్తాం. ఆయకట్టు రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది.

– వెడ్మ బొజ్జు పటేల్, ఖానాపూర్ ఎమ్మెల్యే

నిందితులను శిక్షించాలని ఆందోళన



పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించిన మహిళలు, కుటుంబసభ్యులు

- రోడ్డుపై బైఠాయించిన మృతుడి కుటుంబ సభ్యులు, మహిళలు

నార్నూర్: ప్రభుత్వ ఉపాధ్యాయుడు జాదవ్ గజానంద్‌ను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని పలు గ్రామాలకు చెందిన మహిళలు, యువకులతో పాటు కుటుంబ సభ్యులు శుక్రవారం ఆందోళనకు దిగారు. మండలకేంద్రంలోని రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి డిప్యూటీ తహసీల్దార్ అమృత్‌లాల్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని ఆందోళనకు దిగారు. సీఐ రహీం పాషా వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. హత్యకు కారకులైన వారిని త్వరలోనే రిమాండ్ చేస్తామని, ఎంతటి వారినైనా వదిలే ప్రస్తకే లేదన్నారు. కేసు దర్యాప్తునకు సహకరించాలని కోరారు. దీంతో వారు శాంతించారు. మృతుడి తల్లిదండ్రులు జాదవ్ బిక్కు–జీజాబాయి మాట్లాడుతూ.. తన కొడుకును కొడలే హత్య చేయించిందని ఆరోపించారు. ఆమెతో పాటు సహకరించిన వారికి ఉరి శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాథోడ్ సావీందర్, రాథోడ్ దేవికాబాయి, రాథోడ్ జితేందర్, అర్జున్, రమేశ్, రోహిదాస్, సోరాజీ తదితరులున్నారు.



సీఐ రహీంపాషాతో మాట్లాడుతున్న మృతుడి తల్లిదండ్రులు

మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించిన జెడ్పీ చైర్మన్, బోథ్ ఎమ్మెల్యే

ఉపాధ్యాయుడు గజానంద్‌ను హత్య చేసిన నిందితులను చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ డిమాండ్ చేశారు. నాగల్‌కొండ గ్రామంలోని బాధిత కుటుంబాన్ని శుక్రవారం వారు పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా కల్పించారు.

పిడుగుపాటుకు ఎద్దు మృతి

నర్సాపూర్ (జి): మండలంలోని బూరుగుపల్లి(జి) గ్రామానికి చెందిన రాథోడ్ ప్రకాశ్ అనే రైతుకు చెందిన ఎద్దు శుక్రవారం పిడుగుపాటుకు మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని ప్రకాశ్ వేడుకున్నాడు.



పిడుగుపాటుకు మృతి చెందిన ఎద్దు

విద్యుత్ షాక్‌తో గేదెలు మృతి



రాచాపూర్‌లో మృతి చెందిన గేదె వద్ద రైతు లస్మయ్య

లక్ష్మణచాంద: మండలంలో విద్యుత్‌షాక్‌తో రెండు గెదెలు శుక్రవారం మృత్యువాతపడ్డాయి. రాచాపూర్ గ్రామానికి చెందిన బన్నెబోయిన లస్మయ్యకు చెందిన గేదె మేతకు వెళ్లి అక్కడ విద్యుత్ షాక్ తగలడంతో మృతి చెందింది. కనకాపూర్ గ్రామానికి చెందిన దొడ సాయవ్వ గేదె ఉదయం మేతకు వెళ్లింది. మేత మేస్తుండగా విద్యుత్ షాక్ తగలడంతో మృతి చెందింది. ఒక్కో గేదె విలువ రూ.50 వేల వరకు ఉంటుందని బాధితులు తెలిపారు. ప్రభుత్వం పరిహారం చెల్లించాలని వేడుకున్నారు.

సోన్: మండలంలోని జాఫ్రాపూర్ గ్రామానికి చెందిన రైతు అందెటి సాయరెడ్డి ముర్రా జాతి గేదె శుక్రవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. రోజూ లాగానే గేదెను అరుబయట విద్యుత్ స్తంభం సమీపంలో కట్టేశాడు. ఈ క్రమంలో విద్యుత్ తీగ తెగి గేదెపై పడడంతో షాక్ తగిలి మృతిచెందింది. రూ.80 వేల నష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు. మండలం పశు వైద్యాధికారి డాక్టర్ మహేశ్ గేదెను పరిశీలించారు.



కనకాపూర్‌లో మృతి చెందిన గేదె



సోన్ మండలం జాఫ్రపూర్ గ్రామంలో మృతి చెందిన గేదెతో యజమాని సాయరెడ్డి

మహా ధర్నా విజయవంతం చేయాలి

- తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మైపతి అరుణ్



అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: ఆదివాసీల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం వచ్చే నెల 15న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే మహా ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మైపతి అరుణ్ కోరారు. ఈమేరకు రాష్ట్ర కమిటీ నాయకులతో కలిసి మండలంలోని అమరవీరుల స్తూపాన్ని శుక్రవారం సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఏజెన్సీ డీఎస్సీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. అలాగే ఆదివాసీలు సాగు చేస్తున్న పోడు భూములకు హక్కు పత్రాలు పూర్తిస్థాయిలో అందించాలన్నారు. ఆదివాసీ సమస్యల పరిష్కారం దశలవారీగా ఆందోళనకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 24న ఉట్నూర్, భద్రాచలం, ఏటూర్‌నాగారం ఐటీడీఏ కార్యాలయాల ఎదుట తుడుందెబ్బ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే జూలై 15న హైదరాబాద్‌లో మహా ధర్నా కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ ఆందోళనలకు తొమ్మిది తెగల ఆదివాసీల పెద్దలు, సంఘాల నాయకులు భారీగా తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేశ్, కార్యదర్శి కొడప నగేశ్, ఉపాధ్యక్షుడు కుమ్ర శ్యామ్‌రావ్, మహిళా సంఘం నాయకురాళ్లు రేణుక, పెందోర్ పుష్పరాణి, ఉయిక ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో ల్యాబ్‌టెక్నీషియన్ ఆత్మహత్య


సోన్: అప్పులు తీర్చే మార్గం లేక ఓ ల్యాబ్ టెక్నీషియన్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోన్ మండలంలో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా బంగల్‌పేటకు చెందిన భూస విష్ణువర్ధన్(35) తన మేనకోడలు పెళ్లికి, ల్యాబ్ కోసం అప్పులు చేశాడు. అవి తీర్చే మార్గం లేకపోవడం, అప్పు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి పెరగడంతో విష్ణువర్ధన్ భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఒంటరిగా ఉంటున్న విష్ణువర్ధన్ జీవితంపై విరక్తి చెంది గురువారం సోన్ మండలం సంగంపేట శివారు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.శుక్రవారం మృతదేహం తేలడంతో పోలీసులకు సమాచారం అందించారు. వారు మృతదేహాన్ని వెలికితీయించి పట్టణంలోని బంగల్‌పేటకు చెందిన విష్ణువర్ధన్‌గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అతడి అక్క సంగు జయలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శంకర్ తెలిపారు.

మహిళ మృతదేహం ఆచూకీ లభ్యం

- భర్తే హంతకుడని పోలీసుల అనుమానం

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని ఖుర్షీద్‌నగర్ సమీపంలో గల మమత జిన్నింగ్ మిల్లు వద్ద గురువారం ఓ మహిళ మృతదేహం లభించడం కలకలం రేపింది. గుర్తు తెలియని మృతదేహంగా టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ వేగవంతం చేశారు. దర్యాప్తులో భాగంగా మృతురాలి వివరాలు గుర్తించారు. మృతురాలు ఖుర్షీద్‌నగర్ కాలనీకి చెందిన భారతి అలియాస్ సల్మా (35)గా తేల్చారు. ఆటో నడుపుతూ జీవనం సాగించే ఆమె భర్త ఖలీల్‌కు మృతురాలు రెండో భార్య. కాగా ఆమెపై అనుమానంతోనే భర్తే హత్య చేసి అక్కడ పడేసినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఈమేరకు అతడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. శనివారం పూర్తి వివరాలు వెల్లడించే అవకాశం ఉంది.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



కర్నె రాజు (ఫైల్)

బజార్‌హత్నూర్: రోడ్డు ప్రమాదంలో గత ఆదివారం గాయపడిన కర్నె రాజు(32) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడిది జైనథ్ మండలం గిమ్మె గ్రామం. నాలుగేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం బజార్‌హత్నూర్‌కు వచ్చి నివాసం ఉంటున్నాడు. ఈ నెల 9న ఆదివారం సాయంత్రం రాజు తన మిత్రులు పాలకరి వినోద్, జొర్రిగ రమేశ్‌తో కలిసి బోథ్ మండలం సొనాల గ్రామానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో బజార్‌హత్నూర్‌కు వస్తుండగా బైక్ అదుపుతప్పి గుంతలో పడిపోయింది. తలకు తీవ్రగాయాలైన రాజును వెంటనే ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాజు శుక్రవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పోచమ్మ ఆలయంలో చోరీ

తాంసి: భీంపూర్ మండలం గుబిడి గ్రామంలో గల పోచమ్మ ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గురువారం రాత్రి ఆలయంలోకి చొరబడి విగ్రహాన్ని ఎత్తుకెళ్లారు. గ్రామస్తులు ఉదయం గమనించి పోలీసులకు సమాచారం అందించారు. భీంపూర్ పోలీసులు అక్కడికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు. విగ్రహంపై ఉన్న వెండి కిరీటం కోసమే దుండగులు ఈ ఘాతుకానికి పాల్పడి ఉండవచ్చని గ్రామస్తులు భావిస్తున్నారు.

పెద్దమ్మ ఆలయంలో..

కడెం: ఖానాపూర్ మండలం, కడెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని సింగాపూర్ గ్రామంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోకి చొరబడి హుండీ పగులగొట్టి నగదు ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం ఆలయానికి వచ్చిన అర్చకుడు లింగయ్య గమనించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై ఎం.కృష్ణసాగర్ రెడ్డి సిబ్బంది, డాగ్ స్క్వాడ్‌తో ఆలయ పరిసరాలను పరిశీలించారు. పూజారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ముధోల్: మండల కేంద్రంలోని కంటి ఆసుపత్రి వద్ద శుక్రవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కుభీర్ మండలం పల్సి తండాకు చెందిన ప్రమోద్‌కుమార్ తన తల్లి అస్తికలు గోదావరిలో కలపడానికి మరో వ్యక్తితో కలిసి ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. ముధోల్ కంటి ఆస్పత్రి వద్దకు రాగానే అక్కడ రోడ్డు మరమ్మతు పనులు చేస్తున్న సిబ్బంది బైక్‌ను అడ్డుగా పెట్టారు. అయితే ప్రమోద్‌కుమార్ నేరుగా ఆ బైక్‌ను ఢీకొని కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న ప్రమోద్‌తోపాటు మరో వ్యక్తికి గాయాలయ్యాయి.

డబ్బుల కోసం డిమాండ్..

గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించకుండా రోడ్డు పనులు చేస్తున్న సిబ్బంది డబ్బులు డిమాండ్ చేశారు. బైక్ బాగా డ్యామేజీ అయిందని డబ్బులు ఇచ్చాకే కదలాలని పట్టుపట్టారు. తన తల్లి అస్తికలు కలుపడానికి వెళ్తున్నామని చెప్పినా వినిపించుకోలేదు. దీంతో స్థానికులు వారిని మందలించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై మోహన్‌రావు అక్కడికి చేరుకుని రోడ్డు పనులు చేస్తున్న సిబ్బందిని మందలించారు. ప్రమోద్‌కు బైక్ తాళాలు ఇప్పించారు.

మెరుగైన విద్యనందించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. ఆశ్రమ ఉన్నత పాఠశాల నర్సాపూర్–బి శాటిలైట్‌సెంటర్, సాలెగూడ పాఠశాలలను పీవో శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న బోధన, వైద్య సదుపాయాలు, భోజనం తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల హాజరు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతిరోజు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడారు. పీవో వెంట ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న పీవో ఖుష్బూ గుప్తా

గోదావరిలో పడి యువకుడు మృతి



రపతి భోజయ్య (ఫైల్)

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి గ్రామానికి చెందిన తాపీ మేస్త్రి రపతి భోజయ్య (28) పంచగుడి గ్రామ సమీపంలోని గోదావరి నదిలో స్నానం చేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటమునిగి మృతిచెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. భోజయ్య ముంబైలో తాపీ మేస్త్రీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వారం క్రితం స్వగ్రామానికి వచ్చాడు. గురువారం సాయంత్రం తన బావమరుదులు రోహిత్, రోహన్‌తో కలసి గోదావరి స్నానానికి పంచగుడి వంతెన వద్దకు వెళ్లాడు. ఆ ప్రాంతంలో లోతు ఎక్కువగా ఉండడంతో భోజయ్య నదిలో గల్లంతయ్యాడు. ఎంతసేపైనా బయటకు రాకపోవడంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పొద్దుపోయే వరకూ గాలించారు. శుక్రవారం ఉదయం లోకేశ్వరం పోలీసులకు సమాచారం అందంచడంతో గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టి మృతదేహం బయటకు తీశారు. భోజయ్య భార్య హరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అతనికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.



పంచగుడి గోదావరి నది ఒడ్డున పంచనామా నిర్వహిస్తున్న ఎస్సై రాజు

అంబులెన్స్‌లో ప్రసవం

కుభీర్: మండలంలోని పల్సితండాకు చెందిన కవితకు శుక్రవారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. అంబులెన్స్‌లో భైంసా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో నొప్పులు ఎక్కువ కావడంతో సిబ్బంది లక్ష్మణ్, సుభేర్ ప్రసవం చేశారు. కవితకు ఆడపిల్ల జన్మించిందని, తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారని తెలిపారు. అనంతరం ఇద్దరినీ భైంసా ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు.



పుట్టిన బిడ్డతో అంబులెన్స్ సిబ్బంది

ఎనిమిది మందిపై కేసు

ఇచ్చోడ: మండల కేంద్రంలో గురువారం సాయంత్రం ఇరువర్గాల మధ్య జరిగిన గొడవలో ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. పశువులు తరలిస్తున్న వాహనం ఆపిన విషయంలో ఇరువర్గాల మధ్య గొడవ చోటు చేసుకుంది. ఈ ఘటనలో అఫ్రోజ్‌తో పాటు మరో ముగ్గురిపై, అలాగే గణేశ్‌తో పాటు మరోముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.